www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 353 ISSUE : 353 | బుధవారం, 20 మే, 2026 WEDNESDAY, MAY 20, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## నేడు దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

- ఆన్‌లైన్‌లో మందులు విక్రయించే ఈ-ఫార్మసీ సంస్థలపై అభ్యంతరాలు
- ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు

2 లో..

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

- ఐదు రోజుల్లోనే రెండోసారి..
- లీటరు పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసల పెంపు
- హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.111.88
- డీజిల్ ధర రూ.99.89కు చేరిక
- పెంపు మన దేశంలోనే తక్కువ: బీజేపీ



**న్యూఢిల్లీ, మే 19:** దేశంలో మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. పెట్రోల్‌పై లీటరుకు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచుతున్నట్టు పెట్రోలియం సంస్థలు మంగళవారం ప్రకటించాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెట్రోల్ రేట్లు పెంచబోమన్న ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా ఐదు రోజుల్లోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. ఈ నెల 15వ తేదీన పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచగా, తాజాగా మరో 90పైసల వరకు పెంచారు. దీనితో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.111.88కి డీజిల్ ధర రూ.99.89కి చేరాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల్లో స్థానిక పన్నుల ఆధారంగా, వేర్వేరు కంపెనీల బంకుల్లో రవాణా వ్యయం ఆధారంగా ఈ పెంపులో కాస్త హెచ్చుతగ్గులు ఉంటాయి. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ రూ.98.64, డీజిల్ రూ.91.58కి చేరాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదనే సంకేతాలు వెలువడ్డాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారీ స్థాయిలో నష్టాలు వస్తున్నాయని పెట్రోలియం కంపెనీలు పేర్కొన్నాయి. పెట్రోల్, డీజిల్‌లపై లీటర్‌కు రూ.10 చొప్పున పెంచవచ్చనే అంచనాలూ వెలువడ్డాయి. అయితే ఒక్కసారిగా పెంచితే ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమయ్యే నేపథ్యంలో దశలవారీగా పెంచాలని పెట్రోలియం కంపెనీలు సిద్ధమైనట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సీఎన్జీ ధర కూడా కిలోకు 15వ తేదీన రెండు రూపాయలు, 17వ తేదీన ఒక రూపాయి కలిపి రూ.3 పెరిగింది. ఇలా పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు పెరగడంతో రవాణా వ్యయం పెరిగి.. దాదాపు అన్నిరకాల వస్తుసేవల ధరలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా పశ్చిమాసియా సంక్షోభం అనంతరం ప్రపంచంలో గల్ఫ్ దేశాలు మిగతా 2లో..

# పాలమూరు-రంగారెడ్డి ఈ టర్మ్‌లోనే పూర్తి

- ప్రాజెక్టు పూర్తి కాకపోవడానికి భూసేకరణే ప్రధాన సమస్య
- యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలి
- నిధులకు ఢోకా లేకుండా చేస్తా.. పెండింగ్ బిల్లులూ చెల్లిస్తా
- మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి మరీ పూర్తి చేయించాలి
- రిజర్వాయర్లు, ప్రధాన కాల్వల భూసేకరణపై దృష్టిసారించాలి
- భూసేకరణ పూర్తి కాగానే ప్రాజెక్టు పనులను ప్రారంభించాలి
- ఉమ్మడి మహబూబ్‌నగర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్



**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 19:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఈ టర్మ్‌లోనే పూర్తి చేస్తామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిలిచిపోయిన భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ పాలు పంచుకోవాలని, దగ్గరుండి మరీ పూర్తి చేయించాలని నిర్దేశించారు. భూసేకరణ పూర్తి కాగానే పనులు కూడా చేపట్టాలని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్; మక్తల్- నారాయణపేట- కొడంగల్; కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూములను సేకరించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మంగళవారం ఆయన ఎంసీహెచ్‌ఆర్డీలో ప్రాజెక్టులపై సమీక్షించారు. పాలమూరు- రంగారెడ్డికి సంబంధించి నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్యలను చర్చించారు. కొల్లాపూర్ నుంచి షాద్‌నగర్ వరకు నీటిని తీసుకెళ్లే ప్రధాన కాల్వలకు భూమిని సేకరించే ప్రక్రియ పెండింగ్‌లో పెట్టడమే ప్రధాన సమస్యగా గుర్తించారు. నియోజకవర్గాల వారీగా ఎక్కడెక్కడ భూమిని సేకరించాలి.. దానికి ఉన్న సమస్యలు ఏంటన్న దానిపై సమీక్ష చేశారు. ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తికాకపోవడానికి భూసేకరణ జరగకపోవడమే ప్రధాన కారణమని, దీన్ని గుర్తించే కాంగ్రెస్ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.5 వేల కోట్లను ప్రత్యేకంగా ప్రాజెక్టుల మిగతా 2లో..


# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

- మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల
- మన తీరంలో మనదే బోటు..మనదే వేట
- పొరుగు రాష్ట్రా ల మత్స్యకారులకు స్థానం లేదు
- సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

**నెల్లూరు, (వార్త వేదిక సూర్య)-మే 19:**

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి మిగతా 2లో..





## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు
- ఈనెల 31లోపు పోర్టల్‌లో వివరాలు నమోదు

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 19:**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మిగతా 2లో..



## వీధికుక్కలను తరలించాల్సిందే

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతి జిల్లాలో పూర్తిస్థాయిలో బర్త్ కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

**న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-మే 19:**

వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణుల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను మిగతా 2లో..

# ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి పెంపు

- 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ
- రాష్ట్ర ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న సడలింపు
- మరో ఏడాది పాటు అమలులో




**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 19:**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూసే అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారి వయసు 34సంవత్సరాలుగా ఉండగా దానిని మరో 10 సంవత్సరాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ జీఓ జారీ చేసింది. నిరుద్యోగ యువత అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కానీ, పెంచిన వయోపరిమితి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు మాత్రమే వర్తిస్తుందని, యూనిఫాం మిగతా 2లో..

# తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమి దిశగా చర్యలు
- పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి




**న్యూఢిల్లీ, మే19:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్'2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు మిగతా 2లో..



## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

2 లో..

సంపుటి: 1 సంచిక: 353 వార్త వేదిక సూర్య బుధవారం, 20 మే, 2026

# ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభుత్వ ఉదోగాలకు గరిష్ఠ వయోపరిమితి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసుల ఉద్యోగాల పెంపునకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలీస్, అగ్నిమాపక, ఎక్సైజ్ కంట్రోల్, జైలు, అటవీశాఖల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న 34 ఏళ్ల వయో నిబంధననే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ ఆవిర్భావం తరువాత గరిష్ట వయోపరిమితిని పదేళ్ల పాటు పొడిగించారు. ఆ తరువాత దానిని మరో రెండేళ్ల పాటు పొడిగించారు. ఆ గడువు కూడా ప్రస్తుతం ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

(మొదటి పేజీ తరువాయి)

మినహా భారత్‌లో మాత్రమే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అతి తక్కువ అని బీజేపీ పేర్కొంది. చాలా దేశాల్లో 20శాతం నుంచి 50శాతానికిపైగా పెట్రోలియం ధరలు పెరిగితే.. భారత్‌లో ఈ పెంపు కేవలం 4శాతమేనని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత ప్రభుత్వ రంగ పెట్రోలియం కంపెనీలు రోజుకు రూ.1,000 కోట్లు నష్టాలను భరిస్తూ వస్తున్నాయని, ప్రజలపై భారం వేయలేదని తెలిపారు.

# నేడు దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

**న్యూఢిల్లీ, మే 19:** దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బుధవారం మూతపడనున్నాయి. ఆన్‌లైన్‌లో మందులు విక్రయించే ఈ-ఫార్మసీ సంస్థలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు రిటైల్ షాపులు బంద్ పాటించనున్నాయి. అయితే అన్ని ప్రధాన ఫార్మసీ చైన్ షాపులు, ఆస్పత్రుల్లో ఉండే మెడికల్ స్టోర్లు, జన ఔషధి కేంద్రాలు, అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్స్ మాత్రం తెరిచే ఉంటాయి. ఇటీవల ఏఐఓసీడీ ప్రతినిధులు కేంద్ర డ్రగ్ నియంత్రణ సంస్థతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈ-ఫార్మసీల నియంత్రణ, నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో చట్టపరమైన అన్ని అంశాలను పరిశీలించి సరైన నిర్ణయం తీసుకుంటామని డ్రగ్ నియంత్రణ సంస్థ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏఐఓసీడీ ఒక రోజు బంద్ పాటించాలని నిర్ణయించింది. అయితే తాము ఈ బంద్‌లో పాల్గొనబోమని పశ్చిమ బెంగాల్, కేరళ, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణ, ఉత్తరప్రదేశ్, లదాఖ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల అసోసియేషన్లు లేఖలు సమర్పించాయి.

# ఎబోలాపై అప్రమత్తమైన భారత్

- ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు

**న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-మే 19:**

ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా ఇప్పటికే 100 మంది మృతి చెందారు. 390 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాంగోలోని ఆరుగురు అమెరికన్లకు ఈ వ్యాధి సోకినట్లు పేర్కొన్నారు. వీరిని క్వారంటైన్ కోసం సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఎబోలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించ కుండా నిఘా పెట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన చెందాల్సి అవసరం లేదని ఆయన సూచించారు.

# ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.919.13 కోట్లు విడుదల

**అమరావతి, (వార్త వేదిక సూర్య)-మే 19:**

ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.919.13 కోట్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. బకాయిల చెల్లింపుల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. ట్రై'పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో నిధులు విడుదల చేసినట్లు వివరించారు. 785 ప్రైవేట్ ఆస్పత్రులు బిల్ డిస్కౌంటింగ్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రుల ఖాతాలకు ఇప్పటికే రూ.919.13 కోట్లు జమ చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ చక్రధరబాబు.. మంత్రికి నివేదిక అందజేశారు. ఆస్పత్రుల విజ్ఞప్తి మేరకు వేగంగా బకాయిలు చెల్లించామని అన్నారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేశారని తెలిపారు. ట్రస్టు ' ఆస్పత్రులు 'పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మధ్య ఒప్పందాలు జరిగాయని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ఆస్పత్రులకు మొత్తం రూ.5,556 కోట్లు చెల్లించామని తెలిపారు. అదనంగా మరో రూ.919.13 కోట్లు విడుదల చేశామని అన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి ఈ టర్మ్‌లోనే పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

భూసేకరణకు కేటాయించామని గుర్తు చేశారు. భూ సేకరణపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలు తనకు ఇవ్వాలని నిర్దేశించారు. ఆ సమావేశాలకు ఈఎన్‌సీలనూ పంపిస్తానని చెప్పారు. ప్రాజెక్టుల భూసేకరణను తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని, భూ సేకరణకు నిధుల విడుదలలో ఎటువంటి జాప్యమూ ఉండబోదని, పెండింగ్ బిల్లుల చెల్లింపులను కూడా పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. కాంట్రాక్టులపై కాకుండా తొలుత రిజర్వాయర్లు, పంటలకు నీరందించే ప్రధాన కాల్వల భూ సేకరణపై దృష్టి పెట్టి పూర్తి చేస్తే ఆటంకాలు లేకుండా వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయవచ్చని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అలాగే, ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల నికర జలాల కేటాయింపునకు కేంద్రాన్ని ఒప్పించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేశామని, కల్వకుర్తి పథకంలోనూ భూసేకరణకు నిధులు ఇచ్చామని తెలిపారు. మక్తల్- కొడంగల్ పథకంలో తొలుత భూములన్నీ సేకరించాకే టెండర్లు పిలిచి... పనులు చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు మంగళవారం మంత్రి ఉత్తమ్‌తోనూ ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా భూసేకరణ సమస్యలపై ఈనెల 25, 26 తేదీల్లో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని ఆ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా వీటిని నిర్వహించనున్నారు. 25న మహబూబ్‌నగర్, 26న నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జరగనున్నాయి. సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ పాల్గొంటారు. జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలు సమావేశాలను నిర్వహించనున్నారు. భూ సేకరణ ప్రక్రియకు సంబంధించి ఈ సమావేశాల్లో పేపర్ వర్క్ పూర్తి చేసుకుని మరోమారు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నారు.

## 23న యాదగిరిక్షేత్రానికి సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఈనెల 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకోనున్నారు. ముఖ్యమంత్రి 23న ఉదయం 9.30 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్రసరస్వతి ఆశీస్సులతో పెద్దగుట్ట వద్ద టెంపుల్ సిటీలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న వేదపాఠశాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కొండపై దాదాపు రూ.100కోట్ల నిధులతో నాలుగు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా, గోదావరి పుష్కరాల్లోపు బాసర ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారుల్ని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దేవాదాయ శాఖ అధికారులతో సీఎం మంగళవారం మాట్లాడారు. ఆలయ అభివృద్ధి నమూనాతోపాటు పనుల్ని వేగవంతంగా చేయాలని సూచించారు.

# తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)

పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్'అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు'2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4'వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4'వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యూషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు.



# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే19:**

జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్ కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు.వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆరఅండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణతోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆయన ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ , నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి మహేశ్ భగవత్, ఎడిజి(ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వీధికుక్కలను తరలించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటాయన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం. ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014'19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ వి సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'వి చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019'24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

- సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత
- తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై, (వార్త వేదిక సూర్య)-మే 19:**

ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు.

గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు. ఒకప్పుడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.



## అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

మోత్కూరు, మే 19( వార్త వేదిక సూర్య):

అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఆర్ భీముడు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మంగళవారం ఎస్ఎంఆర్ బార్ అండ్ రెస్టారెంట్ లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 11 వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్, లీడింగ్ ఫైర్ ఫైటర్ జి వెంకటేశ్వర్లు, ఫైర్ ఫైటర్ టెక్నికల్ డి నరేష్, ఫైర్ ఫైటర్స్ బి.రవీందర్ నాయక్ జె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్స్ బంద్ ర్యాలీకి అనుమతి కోరుతూ ఏసీపీకి వినతిపత్రం

మైలర్ దేవ్ పల్లి,మే 19 ( వార్త వేదిక సూర్య ) :



మెడికల్స్ బంద్ పిలుపులో భాగంగా బుధవారం తలపెట్టిన శాంతియుత ప్రదర్శన, ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థానిక మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు చాంద్రాయణగుట్ట ఏసీపీ ని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ... తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై బుధవారం చేపట్టే మెడికల్ షాపుల బంద్ పూర్తి ప్రశాంత వాతావ రణంలో జరుగుతుందని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పౌరులుగా చట్టాన్ని, శాంతిభద్రతలను గౌరవిస్తూనే ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులకు వివరించారు. ఈ మేరకు తాము చేపట్టబోయే ర్యాలీకి పోలీసు భద్రతతో కూడిన అనుమతులు మంజూరు చేయాలని ఏసీపీ ని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో స్థానిక మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు ఫార్మసీ వ్యాపారులు ఉన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి ఆకస్మిక తనిఖీ

మైలర్ దేవ్ పల్లి, మే 19 ( వార్త వేదిక సూర్య ) :



మైలార్ దేవ్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుప త్రిలో సిబ్బంది హాజరు పట్టిక, బెడ్లు, మెడిసిన్ ఎక్స్‌పైరీ తేదీలు, ఆసుపత్రి ఆవరణ తదితర అంశాలను పరిశీలిం చారు. గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకొని, ఆసుపత్రిలో అందిస్తున్న అన్ని రకాల సేవలను సమీక్షించారు.

ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం "ఆరోగ్య మహిళా క్లీనిక్" నిర్వహిం చడంతో పాటు మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాలని తెలిపారు. రక్తహీనతతో బాధపడు తున్న వారికి సరైన వైద్యం అందించా లని వైద్యులకు ఆదేశించారు.

అలాగే ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వేచి ఉండే ప్రాంతాల్లో కూర్చునే ఏర్పాట్లు, త్రాగునీటి సదుపాయం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవం తంగా అమలు చేయాలని, రోగుల పట్ల సేవాభావంతో పనిచేయాలని వైద్యులు మరియు సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాపర్టీ టాక్సీలు తగ్గించండి



ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డికి వినతి పత్రం అందించిన కాలనీవాసులు



మహేశ్వరం మే 19 వార్త వేదిక సూర్య

మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విపరీతంగా పెరిగిన ప్రాపర్టీ టాక్సీలపై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనమైన ప్రాంతాలకు అనుగుణంగా టాక్సీల విధానం ఉండాలని, ప్రస్తుతం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికంగా టాక్సీలు వసూలు చేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. హైదరాబాద్ జీహెచ్ఎంసి పరిధిలో అమలవుతున్న విధానాన్నే తమ ప్రాంతంలో కూడా అమలు చేయాలని వారు ఎమ్మెల్యే,ని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాట్లాడుతూ, ప్రాపర్టీ టాక్సీల సమస్యపై జీహెచ్ఎంసి కమిషనర్‌తో చర్చించి, జీహెచ్ఎంసి పరిధిలో అమలులో ఉన్న విధానాన్ని మీర్‌పేట్ ప్రాంతంలో కూడా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎన్‌డీపీ నాలా పనుల త్వరగా పూర్తి చేయాలి





మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం మే 19 వార్త వేదిక సూర్య

మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్కే పురం డివిజన్లో విజయపురి కాలనీలో పర్యటించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణ పనులు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు.

ఇప్పటికే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. మధ్యలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, వర్షాల సమయంలో నగరం మునిగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నగరాభివృద్ధి దృష్ట్యా మంచి ఆలోచనతో ఎస్ఎన్‌డీపీ నాలాల ప్రాజెక్టును ప్రారంభించారని, అయితే ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. దాదాపు రెండు సంవత్సరాలుగా పనులు కొనసాగుతున్నప్పటికీ ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు.

అలాగే నగరంలో చెత్త సమస్య, తాగునీటి ఇబ్బందులు కూడా తీవ్రమవుతున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు బాధ్యతగా పనిచేసి చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

వర్షాకాలానికి ముందే అన్ని డ్రైనేజీ, నాలాల పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే నగరంలోని మూడు కార్పొరేషన్లకు స్పష్టమైన బాధ్యతలు కేటాయించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఆర్కే పురం డివిజన్, సరూర్నగర్ డివిజన్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సాధనకై సమ్మె బాట పట్టిన వివోఏలు




ఆత్మకూరు(ఎం), మే 19 (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో తమ సమస్యల సాధనకై వివోఏ(గ్రామ సంఘం అసిస్టెంట్) జేఏసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మండలం లోని వివోఏలు సమ్మె బాట పట్టారు. మంగళవారం స్థానిక మండల మహిళ సమాఖ్య కార్యాలయం ముందు నిరసన తెలియజేసి రిలే నిరాహార దీక్షకు కూర్చున్నారు.

ఈ సందర్భంగా వివోఏ ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష మాట్లాడుతూ సుమారు గత ఇరవై ఏండ్లుగా గ్రామ సంఘాల అసిస్టెంట్స్ గా పని చేస్తున్నా మాకు ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని, చాలీ చాలని జీతాలతో జీవనాన్ని గడుపుతున్నాము అని వివోఏ లకు కనీసం వేతనం ఇరవై వేల రూపాయలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ కల్పించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని,

అర్హులైన వివోఏ లకు సీసీ లుగా పదోన్నతి కల్పించాలని వివోఏ ల మెడమీద కత్తిలా వేలాడుతున్న జీవో 58 ను సవరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో వివోఏ ల సంఘం నాయకులు మర్యాల నాగభూషణం, వేముల నర్సింహ్మా, తవిటి స్వప్న, పాశం శ్యామల, కిషన్, కానుకుంట్ల శ్రీనివాస్, ఎం జయమ్మ, పోలేపాక భాగ్యమ్మ, కోరకొప్పుల సుధాకర్, నోముల సరిత, కొమ్ము సుచరిత, భూషి ఉపేంద్ర, మర్రిపల్లి ప్రమీల, ఏశబోయిన లావణ్య, ఎం విజయలక్ష్మీ, ఉప్పల విజయ, నామాల రాజు, కే మౌనిక, యాస మహేశ్వరీ, జీడిమల్ల సునీత తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ నీటితో నరకంగా మారిన శ్రీరామ కాలనీ

- ఇళ్లల్లోకి మురుగు నీరు.. బస్తీ వాసుల వలసలు

- స్పందించని అధికారులు.. రోగాల భయంతో ప్రజల ఆందోళన

మైలర్ దేవ్ పల్లి, మే 19 ( వార్త వేదిక సూర్య ) :

మహేశ్వరం నియోజకవర్గంలోని జల్లాపల్లి డివిజన్ పరిధి శ్రీరామ కాలనీ సాయి బార్ గల్లి బస్తీ చివరి వీధిలో తీవ్రమైన డ్రైనేజీ సమస్య ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. రోజుల తరబడి డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగు నీరు నేరుగా ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితులు అదుపు తప్పడంతో కొంతమంది కుటుంబాలు తమ ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నట్లు బస్తీ వాసులు తెలిపారు. వారం రోజులుగా నిల్వ ఉన్న మురుగు నీటితో ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించి ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు పెరిగి డెంగ్యూ, వైరల్ జ్వరాల భయం నెలకొన్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బస్తీ వాసులు హెచ్చరించారు.

## ట్రాఫిక్ నేరాలపై కఠిన చర్యలు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

- మొత్తం 32 వేల జరిమానా వసూలు

మైలర్ దేవ్ పల్లి, మే 19 ( వార్త వేదిక సూర్య ) :




ఆర్ జి ఐ ఎ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మే 19న నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 15 కేసులను పరిష్కరించి, రూ. 32,000 జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన డి . సుదర్శన్‌ను రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కే . వేణుగోపాల్ రెడ్డి ఎదుట హాజరుపరచగా, ఆయనకు ఒక రోజు సాధారణ కారాగార శిక్షతో పాటు రూ. 2,000 జరిమానా విధించారు. అదే విధంగా, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మరో 10 మందిపై మొత్తం రూ. 24,000 జరిమానా విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 4 మందిపై నమోదైన కేసుల్లో రూ. 6,000 జరిమానా విధించారు. రహదారి భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని ఆర్ జి ఐ ఎ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి, తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు.



## భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యల సమ్మేళనంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, మే 19(వార్త వేదిక సూర్య)

అడ్డగుట్ట జోన్ చైర్మన్ రాము, వారసిగూడ జోన్ చైర్మన్ యాదగిరి, పార్సిగుట్ట జోన్ చైర్మన్ అశోక్ రాంనగర్ జోన్ చైర్మన్ వాసుదేవ్ల ఆధ్వర్యంలో మంగళవారం తుకారాం గేట్ నందు భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పాల్గొని వారికి మద్దతుగా నిలబడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్ స్థానిక బిజెపి నేతలు ఉన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి - సిపిఎం

గట్టుప్పల.మే 19.వార్త వేదిక సూర్య:



పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఎం నల్గొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రం లో పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుకుంటూ సామాన్య మానవుల నడివరుస్తూ సంపన్నుల్లా కొమ్ముగాస్తు ధరలు తగ్గించకుండా పెంచిన ధరలు తగ్గించకుండా ఇటీవల రాష్ట్రంలోకి వచ్చిన మోడీ బంగారం కొనొద్దు ఖర్చులు తగ్గించాలంటూ ఉపన్యాసమిచ్చి సంపన్నుల కొమ్ముగాస్తు ప్రజల నడ్డి విరుస్తూ ఉన్నట్లు ఉందని శ్రీశైలం అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజానాట్యం మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ,సిపిఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం,సిపిఎం సీనియర్ నాయకులు చాపల మారయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, పగిళ్ల శ్రీనివాస్ అచ్చిని శ్రీనివాస్, టేకుమట్ల కృష్ణ, రావుల నరసింహ, కర్నాటి వెంకటేశం, రాములు, నరసింహ, నాయకులు ఎండి రబ్బాని, విశ్వనాచారి శంకరయ్య బిక్షం,చెన్నయ్య యాదయ్య రాములమ్మ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం : బిఆరెస్



### రాళ్లగూడా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్

మైలర్ దేవ్ పల్లి, మే 19 ( వార్త వేదిక సూర్య ) :

రాళ్లగూడా రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై బిఆరెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు బిఆరెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో 118 నియోజకవర్గ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాళ్లగూడా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించిన నేపథ్యంలో, కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను బిఆరెస్ నేతలు ఖండించారు.కొలను ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై ప్రశ్నించడం ప్రజా ప్రతినిధుల బాధ్యత అని తెలిపారు. ప్రజల కోసం మాట్లాడే నాయకులను టార్గెట్ చేయడం సరికాదని, అధికారులపై అధికార పార్టీ ఒత్తిళ్లు తేవడం దురదృష్టకరమని అన్నారు.119 నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిన్నగండు రాజేందర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీలకు అతీతంగా పని చేయాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను రాజకీయ లాభనష్టాలకు ఉపయోగించుకోవద్దని హితవు పలికారు.ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ మాట్లాడుతూ, బిఆరెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని, ఎవరి బెదిరింపులకు భయపడదని స్పష్టం చేశారు. అధికార పక్షం చేసే ప్రతి తప్పిదాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బిఆరెస్ శంషాబాద్ సీనియర్ నాయకులు చిలకమర్రి పరందాములు, రాచమల్ల రమేష్, గుంటి చరణ్, హనుమంతు ముదిరాజ్, పరమేష్, యువ నాయకులు రాచమల్ల కార్తిక్, బక్క శ్రీకాంత్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో కలిసి పర్యటించిన మాజీ కార్పొరేటర్ - డాక్టర్ హేమ సామల





సికింద్రాబాద్, మే 19(వార్త వేదిక సూర్య)

డివిజన్ పరిధిలోని ఉప్పర్ బస్తీ మరియు పరిసర ప్రాంతాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల జీహెచ్ఎంసి మరియు జలమండలి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పనులపై అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఉప్పర్ బస్తీ ప్రాంత ప్రజలు సివరేజి లైన్ల సమస్యలు, పాతబడిన వాటర్ లైన్లు, దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని డా. సామల హేమ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి, సమస్యలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మాట్లాడిన డా. సామల హేమ, డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా ఉప్పర్ బస్తీ, ఎస్బీఐ లైన్ వారసిగూడ, కిందిబస్తీ, ఎరుకల బస్తీ, బ్రాహ్మణ బస్తీ ప్రాంతాల్లో నూతన సివరేజి లైన్లు, వాటర్ లైన్ పనులకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పాతబడిన పైపుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక సదుపాయాలతో కొత్త లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అలాగే వెంకటేశ్వర నగర్, బ్రాహ్మణ బస్తీ, ఇందిరా నగర్, ఉప్పర్ బస్తీ ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా ఆమోదం లభించిందని వెల్లడించారు. ఈ అభివృద్ధి పనులన్నింటినీ దాదాపు రూ.1.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు.త్వరలోనే ఎమ్మెల్యే శ్రీ పద్మారావు గౌడ్ చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అనంతరం చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న సివరేజీ లైన్ పనులను డా. సామల హేమ పరిశీలించారు. పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు జరగాలని సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని, డివిజన్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తామని డా. సామల హేమ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వేణు, జలమండలి మేనేజర్ కుషాల్, బీఆర్ఎస్ నాయకులు జహంగీర్, బాలాజీ, మస్తాన్, గగన తదితరులు పాల్గొన్నారు.



## సుందరయ్య నేటి తరానికి ఎంతో ఆదర్శం

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

### ఘనంగా 41వ వర్ధంతి

నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )



స్వాతంత్ర సమరయోధులు దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా 42, 47 వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో తుమ్మల వీరారెడ్డి 43 వ డివిజన్లో డాక్టర్స్ కాలనీ లో ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం సిపిఎం జండా ఆవిష్కరణలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో విలువలు కలిగి నిరాడంబరంగా పార్లమెంటు సభ్యుడిగా, శాసనసభ పక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సమగ్ర నీటి సరఫరా విధానంపై ఒక పుస్తకము రాసి వివరణాత్మకంగా వివరించడం జరిగిందని అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా తమ ఇంటి నుండే ఉద్యమం ప్రారంభించిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. తన భూమిని పేదలకు పంచి భూ పంపిణీ జరగాలని, కష్టించి పనిచేసే వాళ్లకు కూలి గిట్టుబాటు కావాలని కూలి –భూమి పోరాటాలు నడిపిన వీర యోధుడు కామ్రేడ్ సుందరయ్య అని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారు దేశాన్ని వదిలి వెళ్లాలని విద్యార్థి దశ నుండే ఉద్యమాల్లో పాల్గొన్న నాయకుడు అని అన్నారు నేడు సామ్రాజ్యవాదం పెరిగిపోయి ఇతర దేశాలపై యుద్ధాలు ప్రకటిస్తూ అశాంతికి కారణం అవుతున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నేడు ఆయన స్ఫూర్తితో పోరాటాలు నడపాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు ఆయన ఆదర్శాలు నేటి తరం పాటిస్తూ వారు కోరుకున్న దోపిడీ లేని సమ సమాజ నిర్మాణానికి కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ,ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య, తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం బిక్షం, నల్లగొండ పట్టణ కమిటీ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, అద్దంకి నరసింహ, ఊట్కూరు మధుసూదన్ రెడ్డి, గుండాల నరేష్, కందుల అశోక్, ఎండి సర్దార్ అలీ, కుంభం లక్ష్మమ్మ, మాటూరి సునీత గంజి రాజేష్, బొల్లు రవీంద్ర కుమార్,లకపాక రాజు బాణాల పరిపూర్ణ చారి, బొడ్డుపల్లి సైదులు, వేముల వెంకన్న, కారంపూడి రాము, మాటూరి నరేందర్, సునీత, ముత్తయ్య, కాశయ్య సంతోష తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ దళిత ఉద్యమకారులకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు అవకాశం కల్పించాలి

### దళిత ఉద్యమ నాయకుడు ఎల్లేష్ మాదిగ డిమాండ్

దేవరకొండ మే 19 (వార్తా వేదిక సూర్య ):-



తెలంగాణ దళిత ఉద్యమా నాయకులకు రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపకాలలో అవకాశం కల్పించాలనీ ఎం హెచ్ డి మాదిగ హక్కుల దండోరా నల్లగొండ జిల్లా ఇంచార్జ్ ముదిగొండ ఎల్లేష్ మాదిగ సోమవారం నాడు నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో జెయింట్ కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది

# సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

### ప్రజల సమస్యలను పరిష్కరించాలని నిరంతరం కృషి చేసిన త్యాగధనుడు పుచ్చలపల్లి సుందరయ్య

### సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )



దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత,తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేసిన త్యాగధనుడని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయం దొడ్డి కొమరయ్య భవన్ లో పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ పొదుపు చర్యలు ప్రజలు చేయాలని నేను మాత్రం విలాసాలకు పోతానని చెప్పారు. పొదుపు చర్యలు అంటే దేశవ్యాప్తంగా ఒకే విధంగా ఉండాలన్నారు. పేదలను దోచి అంబానీ ఆదానీలకు కట్టబెట్టడాన్ని తప్పుపట్టారు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దారా దత్తం చేస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. భూమి కోసం,భుక్తి కోసం,పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ ప్రాంతంలో జరిగిన సాయుధ రైతాంగ సాయుధ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య అగ్ర భాగాన ఉండి సాయుధ పోరాటాన్ని నడిపారని అన్నారు. వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య ప్రజల కోసం తనకు వారసత్వంగా వచ్చిన వందలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి ఇచ్చి, జీవితాంతం నిరాడంబర జీవితాన్ని గడిపారని కొనియాడారు.1934 వ సంవత్సరంలో తన సొంత గ్రామం నెల్లూరు జిల్లా కొవ్వూరు తాలూకా అలగానిపాడు లో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని నడిపిన మహా యోధుడు సుందరయ్య అని అన్నారు. పార్లమెంటుకు,శాసనసభకు సైకిల్ పై వెళ్లే వారన్నారు. సమాజమే నా పిల్లలు అనుకుని తాను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన సేవలను గుర్తు చేశారు.చట్టసభలకు వన్నెతెచ్చిన మహానేత సుందరయ్య అని,ఆయన పార్లమెంటు,అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ,ఆదర్శ నేతగా ఉంటూ,ప్రతిపక్ష,అధికార పక్ష నేతల మన్ననలు పొందారని అన్నారు. నేడు ఎంతోమంది రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం పనిచేస్తున్నారని,విలువలను మరిచి అక్రమ సంపాదనకు, పదవి వ్యామోహంతో డబ్బు కోసం పార్టీలు మార్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు.

నేటి యువత సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయసాధన కోసం కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, కొండ అనురాధ, ఖమ్మంపాటి శంకర్, తుమ్మల పద్మ, రాజు, భీమ గాని గణేష్, నరసింహ, రవి, మధుసూదన్ రెడ్డి, సరోజ, రాజేష్, పరిపూర్ణాచారి, కొండ ఎంకన్న, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విచ్చల విడిగా పుట్టుక వస్తున్న ప్రయివేట్ పాఠశాలు, కళాశాల విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలి

### ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మం పాటి శంకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలలు, ప్రయివేట్ కళాశాలలు పుట్టగోడుగుల్లా పుట్టుక వస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులను రకరకాల పేర్లతో ఆకర్షణియమైన పేర్లు పెట్టి ఇష్టానుసారంగా ఫీజులుపెట్టి విద్యాహక్కు చట్టాన్ని తుట్లుపోడుస్తూ విద్యని రంగాన్ని పూర్తిగా వ్యాపార రంగ సంస్థ గా మార్చుతున్నారు. నేటి సమాజంలో విద్యా అంగడి లో సరుకుగా మారిందని అన్నారు. పాలక ప్రభుత్వాలు విద్యా రంగాన్ని సమర్థవంతంగా అమలు చేయకుండా కార్పోరేట్ విద్యా సంస్థలకు కోమ్ముకాస్తున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ పర్మిషన్ లేకుండా విద్యా నియమ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు, కళాశాలలు ప్రారంభిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రయివేట్ పాఠశాలల ఆవరణ లో పాఠ్య పుస్తకాలు అమ్మే విద్యా సంస్థలను సిజ్ చేయాలని జిల్లా కలెక్టర్ చోరవ తీసుకుని జిల్లా విద్యాశాఖ అధికారుల పై ఒత్తిడి తెచ్చి పాఠ్యపుస్తకాలు రేట్లు అడ్డగోలుగా పెంచుకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా విద్యా సంస్థల ముందు ప్రత్యక్ష ఆందోళన లు ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు పంపించాలి

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కొనుగోలు కేంద్రాల



నుండి ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన పి.ఏ.పల్లి మండలం అంగడిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు, తరలింపు ప్రక్రియపై సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ.. ఇంకా ఎంత ధాన్యం మిగిలి ఉందని ?ధాన్యం తరలింపులో ఎందుకు జాప్యం జరుగుతోందని కలెక్టర్ ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేసేందుకు అవసరమైన లారీలు, హమాలీల లాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. తహసిల్దార్ జయశ్రీ,ఏవో పాండు, సీఈఓ ప్రభాకర్, సర్పంచ్ చిరంజీవి నాయక్ ,సెంటర్ నిర్వాహకులు మహేష్, తదితరులు వెంట ఉన్నారు.

# పెండింగ్ కేసులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలి





### జిల్లా ఎస్పీ ఆదేశం..

### జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం

### నిర్వహించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ,రోడ్డు ప్రమాదాల నివారణ,మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విదంగా సమర్ధవంతగా పని చేయాలనీ జిల్లా ఎస్పీ గారు పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన పోక్సో, గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, పెండింగ్ కేసుల స్థితి, కోర్టు విచారణలు, నేరస్తులకు శిక్షలు పడేలా తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యు ఐ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి కోర్టుల్లో చార్జిషీట్లు సకాలంలో దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు అధికారులతో సమన్వయం చేస్తుకుంటూ సీసీ నంబర్లు పెండింగ్, వారెంట్ల అమలు, పెండింగ్ సమన్ల తక్షణ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

ఎన్.డి.పి.ఎస్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విదంగా పనిచేయాలని, మాదకద్రవ్యాల సరఫరా, రవాణా, వినియోగంపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఎస్పీ గారు ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళు ,, ప్రజా ప్రదేశాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు, ప్రమాదకర కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత ముమ్మరం చేయడంతో పాటు హెల్మెట్, సీట్ బెల్ట్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. దొంగతనాలు, చోరీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల నివారణకు రాత్రి, పగలు గస్తీలు నిర్వహించాలని, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు స్వాధీనం చేసిన ఆస్తులను త్వరితగతిన అందజేయాలని సూచించారు. డయల్-100 కు వచ్చే ప్రతి కాల్ పై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి తక్షణమే చేరుకోవాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కేసును బాధ్యతగా విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాంక్ మోసాలు, ఓ . టి.పి మోసాలు, ఫేక్ లింకులు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లపై గ్రామ స్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచేలా ప్రజలు, వ్యాపార సంస్థల యజమానులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటి ద్వారా కేసుల ఛేదన వేగవంతం అవుతుందని తెలిపారు. పోలీస్ అధికారులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన సేవలు అందించాలని ఎస్పీ తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పోలీసులు పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. జిల్లాలో నేర నియంత్రణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా భద్రత అంశాల్లో మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )

ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే, కేంద్ర ప్రభుత్వం మే 8 వ తేదీన దేశవ్యాప్తంగా నాలుగు కార్మిక కోడ్‌లకు సంబంధించిన నిబంధనలను గెజెట్ నోటిఫికేషన్ ద్వారా ఏకపక్షంగా ఖరారు చేయడాన్ని నిరసిస్తూ, తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టి.ఎం.ఎస్.ఆర్.యు) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ నిరసన ప్రదర్శనను ఉద్దేశించి టి.ఎం.ఎస్.ఆర్.యు రాష్ట్ర కమిటీ సభ్యుడు పోల రమేష్ అలాగే నల్గొండ జిల్లా కార్యదర్శి సోమ స్వామి మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు ఊడిగం చేస్తూ, దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బలహీనపరిచేందుకే ఈ నల్ల చట్టాల రూల్స్‌ను తీసుకొచ్చిందని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కొత్త కోడ్‌ల వల్ల కార్మికుల ఉద్యోగ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లడమే కాకుండా, ప్రశ్నించే ట్రేడ్ యూనియన్ల పాత్రను తగ్గించేలా నిబంధనలు ఉన్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా "ఫిక్స్ డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్" పేరుతో పర్మనెంట్ ఉద్యోగాల సంస్కృతిని దెబ్బతీసి, కార్మికులను తీవ్ర అభద్రతాభావంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని, యాజమాన్యాలకు అనుకూలంగా పనిగంటలను 8 గంటల నుండి 12 గంటల వరకు పొడిగించుకునేలా అవకాశం కల్పించడం కార్మిక లోకాన్ని వంచించడమేనని ఆయన దుయ్యబట్టారు. ఈ నల్ల చట్టాల వల్ల మెడికల్ మరియు సేల్స్ రిప్రజెంటేటివ్స్ రంగానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న "సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976" ని ఈ కొత్త కోడ్‌లలో విలీనం చేయడం ద్వారా, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టపరంగా ఉన్న రక్షణలు, ప్రత్యేక సెలవులు, స్థిరమైన పనివేళల నిబంధనల అమలులో అనేక అవరోధాలు, చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

దీనివల్ల ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతూ, యాజమాన్యాల వేధింపులను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవగానే కార్పొరేట్ శక్తుల ఎజెండాను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై టి.ఎం.ఎస్.ఆర్.యు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేకమైన ఈ 4 కోడ్‌లను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని, అలాగే "సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976" ద్వారా లభించే రక్షణలను యథావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నల్ల చట్టాలను రద్దు చేయని పక్షం లో రాబోయే రోజుల్లో రాష్ట్ర కమిటీ నిర్ణయాల ప్రకారం మరిన్ని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, మెడికల్ రిప్రజెంటేటివ్స్, కార్మికులు అందరూ కలిసికట్టుగా ఈ పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



## కేబీఆర్ రక్షణకు పోరాడుతాం

### చెట్లను నరికి నగరాన్ని కాలుష్యమయం చేస్తున్న కాంగ్రెస్

### అభివృద్ధి అంటే విధ్వంసమా?

### చెట్ల నరికివేత నిలిపివేయాలని సుప్రీం స్టే హర్షణీయం

### సేవ్ కేబీఆర్ ఫోరం ప్రెస్‌మీట్‌లో పర్యావరణవేత్తలు

**కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఏండ్ల నాటి వృక్షజాలాన్ని తొలగించి పర్యావరణానికి తీవ్ర నష్టం కలగజేసే హెచ్‌సిటీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గేదాకా పోరాటాన్ని కొనసాగిస్తామని సేవ్ కేబీఆర్ ఫోరం ప్రతినిధులు తెలిపారు. చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించిన నేపథ్యంలో మంగళవారం వారు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెట్లను నరికేసి పర్యావరణాన్ని విధ్వంసం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి నమూనా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.**

సిటీ బ్యూరో, మే 19 : కేబీఆర్ పార్క్, దాని పరిసరాల్లో 600కు పైగా వృక్ష జాతులు, వందలాదిగా జంతు జాతులు జీవిస్తున్నాయని, ప్రభుత్వం చేపట్టిన హెచ్‌సిటీ ప్రాజెక్టు వల్ల వాటి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రీయమైన పర్యావరణ అనుమతులు తీసుకోకుండా, ఎలాంటి ప్రజాభిప్రాయం లేకుండా భూసేకరణ చేపట్టారని ఆరోపించారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలోనూ చెట్లను కూల్చి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రభుత్వం కేబీఆర్ పార్కును ధ్వంసం చేసి ఏడు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు పూనుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాచారం

ఫ్లైఓవర్లు, అండర్ పాసులు కట్టడం వల్ల ట్రాఫిక్‌ను ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించారు. చెట్ల తొలగింపుతో పాటు పనులు ప్రారంభించడంతో వేడి, విపరీతమైన శబ్దాలు, డ్రిల్లింగ్ వైబ్రేషన్ల వల్ల పార్కులోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థ నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు చెట్ల నరికివేతపై స్టే విధిస్తూ పనులను ఆపాలని ఆదేశాలివ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌సిటీ పేరిట కేబీఆర్ పార్కు భవితవ్యాన్ని ప్రశ్నార్థకంలో పడేసే ప్రాజెక్టును నిలిపేసేదాకా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సేవ్ కేబీఆర్ ఉద్యమ ప్రతినిధులు కాజల్ మహేశ్వరి, మేజర్ సందీప్ ఖురానా, కింగ్‌షుగ్ నాగ్, డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, మాజీ ప్రొఫెసర్ సాగర్ ధారా, లుబ్నా సర్వత్ తదితరులు పాల్గొన్నారు.

**తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ**

కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు ప్రజాభిప్రాయసేకరణ తూతూ మంత్రంగా చేపట్టారని సేవ్ కేబీఆర్ ప్రతినిధులు ఆరోపించారు. జాతీయ పార్కు చుట్టూ చేపట్టే ప్రాజెక్టు విషయంలో కనీసం పర్యావరణ వేత్తలను సంప్రదించకపోవడం తీవ్రంగా కలచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడం చట్టపరంగా నేరంగా పరిగణిస్తారని అన్నారు. కాంట్రాక్టర్లను సంతృప్తి పరిచేందుకు ఏండ్ల నాటి చెట్లను తొలగించి పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు.

దీన్ని ఒకే కాంట్రాక్టర్ ద్వారా అమలు చేసేందుకు వేర్వేరు భాగాలుగా విభజించినట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. సమగ్ర పర్యావరణ ప్రభావ అంచనా పరిశీలనను తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును వివిధ భాగాలుగా విభజించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 2021 నాటి స్టే ఆర్డర్‌ను జీహెచ్ఎంసీ, ప్రభుత్వం ఉల్లంఘనలకు పాల్పడి చెట్ల నరికివేత, తవ్వకాల పనులు చేపట్టిందని ఆరోపించారు. ఎకో సెన్సిటివ్ జోన్ ప్రక్రియ అసంపూర్తిగా ఉన్నా ఎలాంటి ముందస్తు చర్యలు లేకుండా కోలుకోలేని పర్యావరణ నష్టాన్ని కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**జీవ వైవిధ్యానికి అత్యంత ప్రమాదం..**

ప్రభుత్వం చేపట్టిన హెచ్‌సిటీ ప్రాజెక్టు కార్బన్ ఉద్గారాలను తగ్గించకపోగా వాటిని తీవ్రతరం చేస్తుందని సేవ్ కేబీఆర్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేశారు.

వాహనాల రాకపోకలు పెరుగుతుండటం వల్ల ట్రాఫిక్‌తో పాటు ఉష్ణోగ్రత, గాలి నాణ్యతను నియంత్రించే కీలకమైన పట్టణ పచ్చదనం కనుమరుగవుతుందని అన్నారు. కేబీఆర్ పార్క్ కేవలం జీవ వైవిధ్య హాట్‌స్పాట్ మాత్రమే కాదని, పెరుగుతున్న వేడి, కాలుష్యం నుంచి హైదారాబాద్ మహానగరాన్ని కాపాడే కీలకమైన ప్రజా ఉమ్మడి ఆస్తి అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అవసరమైన ప్రాంతాలను కాపాడటం, పర్యావరణ న్యాయ సూత్రాలను నిలబెట్టడం ఎంత అత్యవసరమో సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం స్పష్టం చేస్తున్నదని వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడని ప్రాజెక్టులను కడుతూ జీవైవివ్యాన్ని ప్రమాదంలోకి నెట్టొద్దని

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహానగరంలో మిగిలి ఉన్న అరకొర పర్యావరణ వారసత్వాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం బలిచేయొద్దని వేడుకున్నారు.



# జలమండలిలో అవినీతి జలగ

## ఏసీబీ సోదాల్లో పట్టుబడ్డ జీఎం..

## వంద కోట్ల అవినీతిపై చర్చ

**సిటీ బ్యూరో, మే 19 :** గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేస్తున్న జలమండలికి అవినీతి మరక అంటుకున్నది. అధికారుల అవినీతి బాగోతం బట్టబయలవుతున్నది. తాగు నీటి సరఫరా, నిర్వహణ పేరిట పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతున్నది. నగర ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అధికారులు పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని లూటీ చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. రెడ్ హిల్స్‌లోని డివిజన్-8 జీఎం ఏసీబీ దాడుల్లో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డట్లు తేలడం కలకలం సృష్టిస్తున్నది. జలమండలిలో ఈ అంశం తీవ్ర ప్రకంపనలు రేపుతున్నది.తెలంగాణ సమాచారం

జలమండలిలో జీఎం స్థాయి అధికారి ఇంట్లో ఏకంగా రూ. 1.1కోట్ల నగదు, రెండు కిలోలకు పైగా బంగారు ఆభరణాలు, తొమ్మిది కిలోలకు పైగా వెండి ఆభరణాలతో పాటు అనేక చోట్ల ప్లాట్లు, ఇండ్ల స్థలాలు, వ్యవసాయ భూములు ఉన్నట్లు తేలింది. ఒక జీఎం స్థాయి అధికారి ఇంట్లో అంతపెద్ద మొత్తం అవినీతి సొమ్ము దొరకడంతో ఏసీబీ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. నోట్ల కట్టలు కుప్పలు తెప్పలుగా దొరుకుతుండటంతో మిషన్ల ద్వారా లెక్కించారు. వెతుకుతున్న కొద్దీ నోట్ల కట్టలు, బంగారు, వెండి ఆభరణాలు లభించడంతో అధికారులు షాకయ్యారు.

జీఎం ఇంట్లో పెద్దమొత్తంలో నగదు, ఆభరణాలు, భూములు, ఇండ్ల డాక్యుమెంట్లు లభించడం జలమండలి అధికారుల అవినీతికి పరాకాష్ఠగా నిలుస్తున్నది. ఇటీవల కాలంలో జలమండలి అధికారులు ఏసీబీకి పట్టుడబడటం ఇదే కావడంతో మరింత మంది అవినీతి అధికారులు ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. జీఎం స్థాయి అధికారికి కోట్లాది రూపాయల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెడ్‌హిల్స్ జీఎం సగ్గం అనంత లక్ష్మీకుమార్ కోట్లా ది రూపాయల నోట్ల కట్టలు, పెద్ద మొత్తంలో అక్రమాస్తులు ఉన్నట్లు ఏసీబీ తనిఖీల్లో దొరకడంతో జలమండలిలో ఏం జరుగుతున్నదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేస్తున్న జలమండలిపై ప్రజల్లో తీవ్ర అసహనం కలిగిస్తున్నది.

తాగునీటి సరఫరా, పనుల నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణం వంటి పనులతో జలమండలి లోటు బడ్జెట్‌లో ఉందని చెప్తున్న అధికారుల ఇండ్లలో నోట్ల కట్టలు ప్రత్యక్షమవడం కలకలం సృష్టిస్తున్నది. స్వ యం ప్రతిపత్తి సంస్థ అయిన వాటర్ బోర్డులో అధికారులు ఇతర ప్రభుత్వ శాఖల కంటే ఎక్కువ జీతాలు, అలవెన్సులు తీసుకుంటున్నారనే అపవాదు ఉన్నది. బోర్డులో జరిగే కార్యకలాపాలు, పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడాన్ని అదునుగా తీసుకుని ఇష్టమొచ్చినట్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రాజెక్టులు, పనుల టెండర్లలో భారీగా అవినీతి జరుగుతున్నదనే ఆరోపణలకు తాజాగా జీఎం స్థాయి అధికారి ఇంట్లో కోట్ల రూపాయలు దొరకడం ఆజ్యం పోస్తున్నది. కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతున్నది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. అవినీతి అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వారిపై నిఘా ఉంచాలని కోరుతున్నారు.

# సఫారీ వాహనంపై ఖడ్గమృగం దాడి..



గువాహతి: సఫారీ జీప్‌పై ఒక ఖడ్గమృగం దాడి చేసింది. తన కొమ్ముతో ఆ వాహనాన్ని ఎత్తి పడేసేందుకు ప్రయత్నించింది. దీంతో ఆ జీప్‌లో ఉన్న టూరిస్టులు భయాందోళన చెందారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అస్సాంలోని మానస్ జాతీయ పార్కులో ఈ సంఘటన జరిగింది. ఆదివారం కొంత మంది టూరిస్టులు పలు వాహనాల్లో సఫారీకి వెళ్లారు. కాగా, ఒక భారీ ఖడ్గమృగం ఆ వాహనాలకు ఎదురుగా వచ్చింది. ముందు ఆగిన సఫారీ జీప్‌పై అది దాడి చేసింది. తన కొమ్ముతో ఆ వాహనాన్ని ఎత్తి పడేసేందుకు ప్రయత్నించింది. దీంతో అది బలంగా ఊగిపోయింది. అందులో ఉన్న టూరిస్టులు భయాందోళన చెందారు. మరోవైపు డ్రైవర్ మెల్లగా ఆ వాహనాన్ని అక్కడి నుంచి ముందుకు నడిపాడు. ఆ ఖడ్గమృగం బారి నుంచి సందర్శకులను కాపాడాడు. ఈ సంఘటనలో ఎవరికీ ఏమీ జరుగలేదని అక్కడి అధికారులు తెలిపారు. అయితే ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# చరిత్రలో నిలిచే విధంగా త్యాగాలను గౌరవించాలి

## డాక్టర్ చెరుకు సుధాకర్

## ఉద్యమకారుల గుర్తింపు లో పారదర్శకత పాటించాలి

## కమిటీ సమన్వయం తో ముందుకు సాగాలి

## టీజేఏసీ పూర్వ చైర్మన్ జి.వెంకటేశ్వర్లు



**నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఉమ్మడి నల్లగొండ జిల్లా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పూర్వ చైర్మన్ జి. వెంకటేశ్వర్లు అన్నారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వేసిన సందర్భంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పూర్వ టీజేఏసి ఆధ్వర్యంలో ఆనాడు క్రియాశీలకంగా ఉద్యమంలో పాల్గొన్న వివిధ రంగాల కు సంబంధించిన ఉద్యమకారులతో మంగళవారం రెడ్ క్రాస్ భవన్ లో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసి ఉద్యమంలో నిస్వార్థంగా పాల్గొన్న అసలైన ఉద్యమకారులకు న్యాయం జరిగే విధంగా గుర్తింపు ప్రక్రియ కొనసాగాలని ఆయన కోరారు. ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగ సంఘాలు, కళాకారుల జేఏసీ, సబ్బండ వర్గాల జేఏసీ, కుల సంఘాలు, న్యాయవాదుల జేఏసీ, విద్యార్థి సంఘాల జాక్, మహిళా సంఘాలు, వివిధ జిల్లాలలో ఏర్పడిన ఉద్యమ సంఘాల నుండి విస్తృత స్థాయిలో అభిప్రాయాలు, ప్రతిపాదనలు స్వీకరించాలని సూచించారు.ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ప్రతి జిల్లాలో పర్యటిస్తూ ప్రత్యక్షంగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించాలని ఆయన అన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో పౌర సమాజం తరఫున పనిచేసిన మేధావులు, రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు తదితరుల సూచనలు కూడా తీసుకోవాలని పేర్కొన్నారు.అన్ని వర్గాల ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మలిదశ తెలంగాణ ఉద్యమ కాలంలో ఏర్పడిన తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని నడిపిన నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధుల సమాచారాన్ని ప్రామాణికంగా పరిగణించాలని ఆయన అభిప్రాయపడ్డారు.



తెలంగాణ ఉద్యమ చరిత్ర, త్యాగాలు, పోరాట స్ఫూర్తి దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా నిజమైన ఉద్యమకారుల ఎంపిక జరగాల్సిన అవసరం ఉందనీ తెలంగాణ ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. ఉద్యమకారులను కనిపెట్టే పని నిజాయితీగా చేయాలని అన్నారు. 1969 ఉద్యమకారుల కమిటీ ఒకటి ఉన్నది ముందుగా వారికి వైద్య అవసరాల కోసం అయినా పది కోట్ల రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.అఖిలపక్షాలను పిలిచి వారి నుంచి కూడా అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఉద్యమకారులకు ముందుగా ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసి, అనంతరం సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు. విద్యార్థి లోకం,విద్యార్థి ఉద్యమకారులు తీవ్రంగా నష్టపోయినారని వారిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, వైద్య సదుపాయాలు, పెన్షన్, విద్యా,ఉపాధి అవకాశాలలో ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల త్యాగాలను చరిత్రలో నిలిచే విధంగా గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చక్రహరి రామరాజు, గోలి అమరేందర్ రెడ్డి, బోనగిరి దేవేందర్, వైద్యుల సత్యనారాయణ, అంబటి నాగయ్య,వీరెల్లి చంద్రశేఖర్, ఇందూరి సాగర్, దూసరి కిరణ్ కుమార్, పందుల సైదులు, పన్నాల గోపాల్ రెడ్డి, పెరిక కరణ్ జయరాజు,రమేష్, శ్రవణ్ కుమార్, నల్ల సోమ మల్లయ్య,వెంకట్రామిరెడ్డి, తోట నరసింహ చారి, సంతోష్ రెడ్డి, చంద్రారెడ్డి, నరేంద్రబాబు, శ్రీనివాస్ రావు,దాసోజు లలిత, లక్ష్మీనారాయణ, భీమార్జున్ రెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ పట్టణంలో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ విస్తృత తనిఖీలు



**నల్లగొండ బ్యూరో, మే 19 (వార్తా వేదిక సూర్య )**

ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో భాగంగా నల్లగొండ పట్టణంలో మంగళవారం విస్తృత స్థాయిలో “ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్” (ఎఫ్. ఎస్. డబ్ల్యు) తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివ శంకర్ రెడ్డి, ఎఫ్ఎస్‌డబ్ల్యూ టెక్నీషియన్ ఎం. వెంకటపతి, డ్రైవర్ పి. వంశీ పాల్గొన్నారు. ఆర్‌పీ రోడ్, డీఈఓ కార్యాలయం పరిసరాలు, డీవీకే రోడ్, సాగర్ రోడ్ ప్రాంతాల్లోని స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు, పండ్ల వ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు, టీ స్టాల్స్, కేఫేలు, మండీలలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో పలు ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొంతమంది వ్యాపారులు చికెన్, మటన్ వంటి మాంసాహార పదార్థాలను సరైన లేబులింగ్ లేకుండా, “యూజ్ బై డేట్” నమోదు చేయకుండా ఫ్రిజ్‌లలో నిల్వ చేసినట్లు గుర్తించారు. శీతలీకరణ ఉష్ణోగ్రతల నిర్వహణకు సంబంధించిన లాగ్ బుక్స్ కూడా లేకపోవడం గమనించారు. కొన్ని మాంసాహార పదార్థాలు పూర్తిగా పాడైపోయిన స్థితిలో కనిపించాయి. బేకరీలలో గడువు ముగిసిన బిస్కెట్లు, చాక్లెట్లు, సాస్‌లు ఇతర ఆహార పదార్థాలతో కలిపి నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహార భద్రత నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఈ పదార్థాలను అక్కడికక్కడే నిర్వీర్యం చేశారు. డీవీకే రోడ్డులోని ఒక కేఫేలో టీ తయారీలో రంగులు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమానాస్పదంగా గుర్తించిన టీ పొడి, చక్కెర నమూనాలను ప్రయోగశాల విశ్లేషణ కోసం పంపించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులలో కలిపి సుమారు 120 కిలోల మేర గడువు ముగిసిన, పాడైపోయిన, నిల్వలో చెడిపోయిన ఆహార పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. వీటిలో చికెన్, మటన్, మంచూరియా, తయారుచేసిన చికెన్ వంటకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, బియ్యం, నూడుల్స్, సాస్‌లు, ఫుడ్ కలర్స్, టీ పొడి, చక్కెర, నిమ్మ ఫ్లేవర్లు తదితర పదార్థాలు ఉన్నాయి.



అనుమానాస్పదంగా గుర్తించిన ఐదు ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాల విశ్లేషణకు పంపించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన రెండు ఆహార వ్యాపార సంస్థలకు మెరుగుదల నోటీసులు జారీ చేయాలని అధికారులు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు వ్యాపారులకు, వీధి ఆహార విక్రేతలకు అవగాహన కల్పించారు. ఫుడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలని, వాడే నూనెలను అనుమతించిన పరిమితిలోనే వినియోగించాలని సూచించారు. టీ పొడిలో రంగులు కలపరాదని హెచ్చరించారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్. ఐ. ఎఫ్. ఓ) విధానాన్ని పాటిస్తూ పాత స్టాక్‌ను ముందుగా వినియోగించాలని తెలిపారు. పండ్ల పక్వానికి కార్బైడ్ వినియోగం పూర్తిగా నిషేధమని, కేవలం ఎథిలీన్ సాచెట్ల ద్వారా మాత్రమే సురక్షిత పక్వ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు పాత వార్తాపత్రికలను ఉపయోగించరాదని, లూజ్ ఆయిల్స్ వినియోగం తగ్గించాలని, పరిశుభ్రమైన నిల్వ, శుభ్రమైన ఆహార తయారీ, సరైన హ్యాండ్లింగ్ పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రజలు కూడా ఆహారం కొనుగోలు చేసే సమయంలో పరిశుభ్రత, నిల్వ విధానం, గడువు తేదీలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు. అనుమానాస్పద ఆహార పదార్థాలు కనిపించినట్లయితే ఫుడ్ సేఫ్టీ శాఖకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# భానుడి భగభగ

## దంచి కొడుతున్న ఎండలు

## 43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

## నిప్పుల కొలిమిలా ఉమ్మడి జిల్లా

## ఉదయం 8 గంటల నుంచే ప్రతాపం

## వడగాలులు, ఉక్కపోతతో ప్రజల ఉక్కిరిబిక్కిరి

## అత్యవసరమైతేనే బయటకు రావాలంటున్న వైద్యులు

**హనుమకొండ, మే 19 :** భానుడు భగ్గుమంటున్నాడు. ఉగ్రరూపంతో సెగలు కక్కుతున్నాడు. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతన్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ సారి మార్చి నెల నుంచి భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచే ఎండివేడి మొదలై 9 గంటల కల్లా సూరీడు చుక్కలు చూపిస్తున్నాడు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నమైతే మాడు పగిలే ఎండతో జనం అల్లాడిపోతున్నారు.

మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీలుగా నమోదైంది. మున్ముందు ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. సాయంత్రం 6 గంటలు దాటినా కూడా ఎండ దగడు తగ్గడం లేదు. ఎండవేడి, వడగాలుల తీవ్రతతో ప్రజలు ఉపశమనం కోసం ఏసీలు, కూలర్ల ఏర్పాటు చేసుకున్నా పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఏటా ఏప్రిల్ నెలాఖరులో.. లేదా మే నెలలో ఎండలు పెరిగేవి. కానీ ఈ సారి మార్చి నెల నుంచే ఎండలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే రానున్న నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని (44 నుంచి 45 డిగ్రీల వరకు) వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

మధ్యాహ్నం వేళల్లో ఎండవేడి ఎక్కువగా ఉండడంతో గ్రామాల్లో ప్రజలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. పట్టణ ప్రాంతల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన ఉక్కపోత, వడగాలులతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు ఉదయం 5 గంటలకు వెళ్లి సాధ్యమైనంత మేరకు ఉదయమే పనులు ముగించుకొని 11 గంటలలోపు ఇండ్లలోకి చేరుతున్నారు. ఎండలో తప్పనిసరి బయటికి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

గత 6 రోజులుగా నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

13వ తేదీన 43.4


14వ తేదీన 41.6

15వ తేదీన 41.9

16వ తేదీన 40.8

17వ తేదీన 41.2

# పెరిక కులం అధ్యక్షుడిగా ఉగ్గే రాజేష్



**రామన్నపేట, (వార్తా వేదిక సూర్య )మే 19 :** పట్టణ పెరిక కుల సంఘం ఎన్నికలు నిర్వహించగా కుల బంధువులందరూ కలసి ఏకగ్రీవంగా ఉగ్గే రాజేష్ ను ఎన్నుకోవడం జరిగింది వారితోపాటు ప్రధాన కార్యదర్శిగా బుర్రి రవీందర్ గౌరవాధ్యక్షులుగా గరిక సత్యనారాయణ కోశాధికారిగా కానుగంటి మునిశ్వర్ మరియు కార్యవర్గ సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తిప్పని పరమేష్ కోట సుధాకర్ వారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించడం జరిగింది ఎన్నికల అనంతరం ఆ కార్యవర్గ మొత్తాన్ని ప్రమాణ స్వీకారం చేయించి ఎన్నికైనట్లుగా ధ్రువీకరణ పత్రాలు అందించడం జరిగింది ఆ తర్వాత నూతన అధ్యక్షుడు ఉగ్గే రాజేష్ మాట్లాడుతూ కులానికి అన్ని విధాల నా వంతు సహాయ సహకారాలని అందిస్తానని ఎవరికైనా మంచి చెడు కార్యక్రమాలు ఏవైనా నేను నా కార్యవర్గం ముందుండి నడిపిస్తామని కుల ఐక్యతకు తోడ్పడుతామని త్వరలోనే కుల భవన నిర్మాణాన్ని నిర్మించడానికి నా వంతు కృషి చేస్తానని ఎవరికైనా ఎలాంటి బాధలు వచ్చినా మేము ముందుండి పరిష్కరించడానికి మా వంతు సహాయం చేస్తామని ఈ సభాముఖంగా తెలియజేస్తున్నానని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారు కొమిరిశెట్టి నరసింహులు కోశాధికారి దాచేపల్లి రాజు రాజాపేట ప్రధాన కార్యదర్శి అంకతి బిక్షపతి ఎన్నారం అధ్యక్షులు మద్ది రమేష్ అరిగ నాగరాజు బొట్టు నరహరి గోదాసు అంజయ్య కోట విజయ వెంకన్న గట్క నవీన్ బుర్రి ఉపేందర్ బుర్రి సతీష్ ఉగ్గే మణికంఠ మరియు కుల పెద్దలు కుల బంధువులు పాల్గొన్నారు.

# శ్రీ నీలం శేఖర్‌కి రాష్ట్ర స్థాయి ఎక్సలెన్సీ అవార్డు, సన్మానం



**రామన్నపేట,మే 19 ,(వార్తా వేదిక సూర్య) :**హైదరాబాదు కేంద్రంగా రవీంద్ర భారతిలో మాజీ హర్యానా గవర్నర్, మాజీ మంత్రి దత్తా త్రేయ గారు, త్రిపుర ప్రిన్సిపల్ సెక్రటరీ ×ూూ వెంకటేశ్వర్లు గారు,సినీ నటులు,కవితడశివపార్వతి గాయకులు మనూ గారు,శర్మ గార్ల చేత ప్రగ్నిక ఫౌండేషన్ దశమ వార్షికోత్సవంలో వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి అవార్డు లు, సన్మానం చేయడం జరిగింది. గత దశాబ్ద కాలంగా వారు సమాజంలో చేస్తున్న సహాయ కార్యక్రమాలు,సమాజ శ్రేయస్సు కోసం పాటు పడే వేదికల తరుపున రాష్ట వ్యాప్తంగా అనేక కార్యక్రమాలకి గౌరవ సలహాదారుడిగా ఉంటున్నారు, ప్రభుత్వ ప్రతిభావంతుల విద్యార్థులకి పుస్తకాలు, నిరుద్యోగులకి మెంటార్ గా ఉంటున్నారు, సామాజిక సంస్థలకి సమన్వయ కర్తగా ఉంటున్నారు.అక్షర, వారియర్ మన ఆపత్బంధువులు, బహుజన అక్షర చైతన్య వారదులు, వివిధ రంగాలకు చెందిన ఫౌండేషన్ లో కీలక పాత్ర పోషిస్తూ అనేక సామాజిక సంస్థలకి గౌరవ సలహాదారుడిగా ఉంటున్నారు..లివీరితో పాటు దూల్పేట్ సీఐ సైదులు గౌడ్ గారికి, ది మిషన్ సెవన్ హిల్స్ ఫౌండర్ సీఐ ఏడుకొండలు గారికి, ఉషోదయపు పల్లె ప్రకృతి ఫౌండర్ వీర శేఖర్ గార్లు అవార్డులు పొందడం జరిగింది.వారి ఫాలోవర్స్ చాలా మంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పలువులు ప్రశంసలు తెలియజేశారు.

# ప్రయాణికులకు దాహార్తి తీర్చడం అభినందనీయం




**మోత్కూరు, మే 19( వార్త వేదిక సూర్య ):** ఆర్టీసీ బస్సులలో వెళ్లే ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసి దాహార్తి తీర్చడం అభినందనీయమని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి,మోత్కూరు సి.ఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టిసి బస్టాండ్ లో స్వాతంత్ర సమరయోధులు దివంగత సూరోజు తిరుపతయ్య శత జయంతిని పురస్కరించుకొని వారి కుమారుడు భాస్కరాచారి ప్రజాభారతి, యుటిఎఫ్ సమన్వయంతో సుమారు 800 మంది ప్రయాణికులకు ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లకు పంపిణీ చేశారు ఈ . సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎన్ చారి, చేతరాశి అంజయ్య, రెడ్ క్రాస్ యూత్ జిల్లా అధ్యక్షులు బీసు మత్స్య గిరి యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కెనపల్లి వెంకటాచారి, మండల అధ్యక్షులు దర్శనం వెంకన్న, నాయకులు యమగాని బుగ్గయ్య, తిరుపతయ్య కుమారుడు లక్ష్మణచారి,కోడలు యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొండ పైన వర్తక సంఘం రద్దు చేయాలని

# సంతకాల సేకరణ జాబితాను ఈవో, చైర్మన్‌కు వినతి

- ఈ నెల 31న కొండపైన దుకాణాల కాలపరిమితి ముగుస్తుంది
- యాదాద్రి పరిరక్షణ కమిటీ

**యాదగిరిగుట్ట మే 19 (వార్త వేదిక సూర్య) :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట దేవస్థానంలో కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని ఈనెల 11న పాత గుట్ట చౌరస్తా వద్ద నిర్వహించిన సంతకాల సేకరణ జాబితాను మంగళవారం ఆలయ ఈవో ఐఏఎస్ భవాని శంకర్, ఆలయ చైర్మన్ నరసింహమూర్తికి యాదగిరిగుట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం పేరిట దేవస్థానానికి సంవత్సరానికి 10 దుకాణాలకు కేవలం రూ.1 కోటి 68 లక్షల మాత్రమే చెల్లిస్తున్నారు. అదే ఒక సెల్ ఫోన్ కౌంటర్ టెండర్ సంవత్సరానికి రూ. 2 కోట్ల 22 లక్షల పైగా దేవస్థానానికి ఆదాయం సమకూరుతుంది. ఇదేవిధంగా ఇతర టెండర్లలో కోట్లలో ఆదాయం వస్తుంది. దేవస్థానంలో ప్రతి టెండర్లు ఒక సంవత్సరం కాల పరిమితితో కొత్తవారికి ఉపాధి వ్యాపార అవకాశాలు కల్పించి దేవస్థాన ఆదాయాన్ని అభివృద్ధితోపాటు భక్తుల సౌకర్యాలు పెంచే ప్రణాళిక చేయాలి. ఒక్కరే దేవస్థానంలో దుకాణాలను కొనసాగించాలని నియమం లేదు. అందరికీ అవకాశాలు కల్పించే దిశగా టెండర్లు జరగాలి, కొండ కింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం వారికి కేటాయిస్తూ గత ప్రభుత్వం వెసులుబాటుగా నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు వేస్తే దేవస్థానానికి ఆదాయం వస్తుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము కొండపైన వర్తక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 10 దుకాణాలను రద్దుచేసి అదనంగా 30 కొత్త దుకాణాలు టెండర్లు వేయాలని స్థానికులు వ్యాపారస్తులు, నిరుద్యోగులు, బాధితులు కోరుతున్నారు. ఈనెల 31 నాటికి కొండపైన వర్తక సంఘంలోని దుకాణాలకు గడువు ముగుస్తుంది. కాగా ప్రతి సంవత్సరం దేవస్థానం పరిధిలో టెండర్లకు 3 నెలల ముందే టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. కానీ టెండర్ల సమయం దగ్గర పడ్డ ఇంతవరకు టెండర్లు వేయకపోవడం గమనార్హం. కొండపై ఉన్న దుకాణాలను కూడా టెండర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికంగా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల దేవస్థానానికి సుమారు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. అంతేకాదు కొత్తవారికి అవకాశం దక్కుతుంది. యాదగిరిగుట్టలో దేవస్థానంలో కొండపై ప్రస్తుతం ఉన్న 112 దుకాణాల కుటుంబాలకి పూర్తి వ్యాపార టెండర్ల హక్కులు లేవు కదా !దేవస్థానంలో ఆదాయం పెరిగితే అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు పెరుగుతాయి. ఎన్నో సంవత్సరాలుగా తిష్ట వేసుకొని కొండపైన దుకాణాలు కొనసాగుతూ వర్తక సంఘం పేరిట దేవస్థాన ఆదాయాన్ని గండి కొట్టే వారి వల్ల దేవస్థాన అభివృద్ధి సాధ్యమవుతుందా..?? లేక టెండర్ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వల్ల సాధ్యమవుతుందా ..?? కొండపై ఉన్న షాపులను టెండర్లు వేస్తే వేలాది నిరుద్యోగులకు, వ్యాపారస్తులకు ఉపాధి కలుగుతుంది. అంతేకాదు కొండ కింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం వారికి కేటాయిస్తూ గత ప్రభుత్వం వెసులుబాటుగా నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు వేస్తే దేవస్థానానికి ఆదాయంతో పాటు వేలాది స్థానిక నిరుద్యోగుల కుటుంబాలకు మేలు జరుగుతుంది.

తరతరాలుగా కొనసాగుతున్న వ్యాపార, ఆర్థిక దోపిడిని అరికట్టాలంటే కొత్త వారికి అవకాశాలు కల్పించాలనేది స్థానిక ప్రజలు, నిరుద్యోగులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు రచ్చ శ్రీనివాస్, గ్యాద పాక బాల్ నరసయ్య, మాటూరి బాలయ్య, బోనగిరి శ్యామ్ ఆరేస్వామి, బండ రామస్వామి, దండ బోయిన వీరేష్, బండి వాసు, పల్లపు బాలయ్య, కర్రె ప్రవీణ్, బండి అనిల్ కొన్నె సంజీవ, గుండ్లపల్లి లింగం, కల్వకొలను సతీష్, బండి అనిల్, స్వర్గం నరేష్, సుదగాని శివ, ఆవుల రాజు, ముక్కెర్ల నరసింహ, మందోజ్ నరేష్, కర్రె శ్యామ్ తదితరులున్నారు.





# సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

**మోత్కూరు, మే 19 (వార్త వేదిక సూర్య):** నాటి పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం అగ్రనేత దివంగత సుందరయ్య చేసిన పోరాటాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మంగళవారం మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య సామాజిక ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చిన గొప్ప పార్లమెంటేరియాన్ అని ప్రజా జీవితంలో ప్రజా ప్రతినిధి అంటే ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే గొప్ప ఆయుధమని చాటి చెప్పిన గొప్ప నాయకుడని అన్నారు. నేటీ రాజకీయాలు ప్రజాసేవకంటే స్వార్థం, సంపాదన, బంధుప్రీతి లాంటి అంశాలతో కలుషితం అయ్యాయని, ప్రజా సమస్యలను మర్చిన నాయకులు పదవి వ్యామోహంతో డబ్బు మద్యం లాంటి వాటికి ప్రజలను అలవాటు చేస్తున్నారని విమర్శించారు. నేటి యువత సుందరయ్య జీవితాన్ని, ఆయన రాజకీయ



ప్రస్థానాన్ని అర్థం చేసుకొని ఆచరణలో పెడితే, సమాజానికి మేలు జరగడమే కాకుండా ఆయన ఇచ్చే ఘనమైన నివాళని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి కురిమేటి యాదయ్య, మండల నాయకులు దడిపల్లి ప్రభాకర్, మెతుకు సాయిలు,కురిమేటి సోమయ్య, బండి రవి,రాచకొండ శ్రీశైలం,చిరుమర్తి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన మాట్లాడిన జగదీశ్వర్ రెడ్డి ఎంపీ విమర్శించడం తగదు



**మోత్కూరు, మే 19( వార్త వేదిక సూర్య):** రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతుల పక్షాన మాట్లాడిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి పై గంట నక్క అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించడం తగదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకూబ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న 20 రోజుల్లో వర్షాలు రానున్నాయని ధాన్యాన్ని ఐకెపి నుంచి కొనుగోలు వేగవంతం చేయాలని ప్రశ్నిస్తే తమ నేతలపై ఎదురు దాడి చేయడమేంటి అని ప్రశ్నించారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఏ నియోజకవర్గం లోనైనా ఐకెపి నుంచి పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు నిరూపిస్తారా అన్నారు.మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అంజి రంగాలలో అభివృద్ధి చేశారన్నారు. రైతుల వద్ద రైస్ మిల్లు యాజమానులు క్వింటాకు 4.5 ఐదు కిలోలు కట్ చేసి చేస్తున్నారని, ఒక్కో లారీ కి 500,600 వందలు డబ్బులు వసూలు చేస్తుంటే ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి, రైతులను ఆదుకోవాల్సిన అధికార పార్టీ నాయకులు బి.ఆర్.ఎస్ నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**మోటకొండూరు, మే 19 (వార్త వేధిక సూర్య :** పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కొండపల్లి వెంకటయ్య (తండ్రి యాదగిరి) అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందగా, ఆయనకు 60,000 రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది.ఎమ్మెల్యే నివాసంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు ఈ చెక్కును ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోందని, నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చెక్కు అందుకున్న లబ్ధిదారుని కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే ఐలయ్య కి ప్రత్యేక కృతజ్ఞతలు



తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ బుడిగె బాలరాజు గౌడ్, మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాపురం మల్లేష్, సీనియర్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, బచ్చె లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలు

**రామన్నపేట, మే 19(వార్త వేదిక సూర్య) :** గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు విమర్శించారు.యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ మహాసభలు రామన్నపేటలో స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ లో ఉత్సాహపూరితంగా జరిగాయి ప్రారంభ సూచికంగా జిల్లా అధ్యక్షుడు ఒళ్ళు యాదగిరి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతినిధుల మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి సరిపడా నిధులు కేటాయించకుండా, పని దినాలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తోందని అన్నారు.నూతనంగా తీసుకువస్తున్న వీబిజిరామ్ జి చట్టం అమలులోకి వస్తే ఉపాధి కూలీలకు ఉన్న హక్కులు మరింత క్షీణించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం ద్వారా కార్మికులకు లభించే పని దినాలు తగ్గిపోవడం, కాంట్రాక్టర్ల పెత్తనం పెరగడం, యంత్రాల వినియోగం అధికమవడం వల్ల గ్రామీణ నిరుద్యోగం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఉపాధి కూలీలకు కనీస భద్రత, జీవనోపాధి కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విధానాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవడానికి గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహాసభలో జిల్లాలో వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానాలు చేసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరిగింది.

ఈ మహాసభల్లో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్,జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహా, రాష్ట్ర నాయకులు ములకలపల్లి రాములు,జిల్లా ఉపాధ్యక్షులు జల్లెల పెంటయ్య, గంగాదేవి సైదులు,సిరిపంగి స్వామి,గుంటోజు శ్రీనివాసచారి,రాచకొండ రాములమ్మ,సహాయ కార్యదర్శులు సల్లూరి కుమార్,జుకంటి పౌల్,



పల్లెర్ల అంజయ్య,కుంకుట్ల చొక్కా కుమారి,ఆహ్వాన సంఘం అధ్యక్షులు కూరెళ్ళ నర్సింహా చారి, ఈ మహాసభలకు సంఘీభావంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడి సౌహర్ద సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గొరిగే సోములు, బొడ్డుపల్లి వెంకటేశం, వ్యకాస మండల అధ్యక్ష, కార్యదర్శులు మేడి ముకుంద,కందుల హనుమంతు,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గంటెపాక శివ కుమార్,ఈర్లపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# టీజీ ఆర్.జె.సి లో అక్షర విద్యార్థుల ప్రభంజనం




**మోత్కూరు, మే 19 ( వార్త వేదిక సూర్య),:** టీజీ ఆర్ జె సి సెట్ 2026 పరీక్ష ఫలితాల్లో అక్షర ఉన్నత పాఠశాల విద్యార్థులు కె సాయి సూరాజ్ ఎంపీసీ విభాగంలో 71 ర్యాంక్ సాధించారు. బైపిసి విభాగంలో డి అర్చన స్టేట్ 131 ర్యాంక్ సాధించారని ఆ పాఠశాల డైరెక్టర్లు రాజిరెడ్డి, శివాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ ఆర్ జె సి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

# గురుపౌర్ణమి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడు




**మోత్కూరు, మే 19 (వార్త వేదిక సూర్య ):** గురు ఏకైక ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడు అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక భువనగిరి, చేర్యాల జిల్లా కమిటీల సభ్యులు దేవేందర్, శివరామకృష్ణ, లింగస్వామి సుకన్య లు అన్నారు. మంగళవారం మండలంలోని సదర్శాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

# సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం

**- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోలగాని జయరాములు**

**- మోటకొండూరులో ఘనంగా వర్ధంతి వేడుకలు**



**మోటకొండూరు, మే 19(వార్త వేధిక సూర్య ):** తాడిత, పీడిత కష్టజీవుల హక్కుల సాధనకై తన జీవితాంతం అలుపెరగక పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మచ్చలేని మహామనిషి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని మోటకొండూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులుబోలగాని జయరాములు మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం ఒక్క కమ్యూనిస్టులకే సాధ్యమని, అందుకు సుందరయ్య జీవితమే నిదర్శనమని కొనియాడారు. ఆయన ఒక పెద్ద భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ, చిన్ననాటి నుండే భూస్వామ్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణలో జమీందారీ, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో సుందరయ్య గారు కీలక పాత్ర పోషించారన్నారు. వ్యవసాయ కార్మికులకు కూలి పెరగాలని, పేదలకు భూమి పంచాలని సంఘాలు పెట్టి పోరాడిన మహోన్నత నాయకుడని స్మరించుకున్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ పీడిత ప్రజల హక్కుల కోసం సిపిఎం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బైరపాక సర్వయ్య, నాయకులు వంగపల్లి సాయిలు, కాదూరి నర్సింలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# మహేశ్వరం ఆర్టిసి డిపో సెక్రటరీగా ఎన్నికైన కంబాలపల్లి కుమార్

**మహేశ్వరం మే 19 వార్త వేదిక సూర్య :** ఎస్ డబ్ల్యూ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేష్ గౌడ్,అదేవిధంగా గోడి శాల అబ్రహం వర్కింగ్ ప్రెసిడెంట్ గారు కే సాగర్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ మరియు ఆర్టీసీ డిపో డ్రైవర్లు కండక్టర్లు ఆర్టీసీ సిబ్బంది మహేశ్వరం మండలంలో ఐ ఎన్ టి యు సి మహేశ్వరం ఆర్టీసీ డిపో కంబాలపల్లి కుమార్ ని ఆర్టీసీ డిపో సెక్రటరీగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో కంబాలపల్లి కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్టీసీ సిబ్బందికి ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారు అని మాట్లాడడం జరిగింది గత ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందిని పట్టించుకోలేదు కార్మిక సమస్యలు ఎటువంటివి కూడా వాళ్ళు తీర్చలేదు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులకు కావున మా యూనియన్ తరపున ప్రతి కార్మిక సమస్యను పరిష్కరిస్తానని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు దూసకంటి రవి అలాగే కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండలాధ్యక్షుడు శెట్టి అశోక్ సేవాదళ్ జనరల్ సెక్రెటరీ తడకల



పరమేష్ ఈ కార్యక్రమంలో కండక్టర్లు డ్రైవర్ మెకానిక్లు శ్రావణ్ ,జంగయ్య, సందీప్, వెంకటేష్,పర్వతాలు తదితరులు పాల్గొన్నారు,

# కల్వర్టు మూసివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

**మోత్కూరు, మే 19 (వార్తా వేదిక సూర్య):**



మోత్కూరు మున్సిపల్ పరిధిలోని జామచెట్లబావికి వెళ్లే దారిలో ప్రభుత్వ కల్వర్టు నుండి వరద నీరు వెళ్లకుండా పెద్ద ఎత్తున అక్రమంగా అడ్డుగా మట్టి పోసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయకట్ట రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై స్థానిక మున్సిపల్ కమీషనర్ కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, మట్టి తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో.వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ప్రభుత్వ నిధులతో గత 30 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుకి అడ్డుగా మట్టి పోయడంతో ఎగువ ప్రాంతాన ఉన్న తమ చెల్కలల్లో వరద నీరు భారీ ఎత్తున నిలిచే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకి అడ్డుగా పోసిన మట్టిని తక్షణమే తొలగించాలని రైతులు ధబ్బేటి చంద్రమౌళి, రమేష్,సత్యనారాయణ, సుదర్శన్, నారాయణ, శ్రీనివాస్, రాములు, డబ్బేటి సోంబాబు లు కోరారు.

# కాకి ఈశ్వర్ గంగమ్మకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు

**మహేశ్వరం మే 29వార్త వేదిక సూర్య :**

కాకి ఈశ్వర్ ముదిరాజ్ గంగమ్మ దంపతులకు 37 వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు:రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, గంగమ్మ, దంపతులకు 37 వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, ముదిరాజ్ సంఘం మహేశ్వరం మండల అధ్యక్షులు కాకి కుమార్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి సత్యనారాయణ ముదిరాజ్, గదగూటి జంగయ్య ముదిరాజ్ , మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్ , ముదిరాజ్ సంఘం పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగుటి మహేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటికల మైసయ్య ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ



అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికుడ రాకేష్ ముదిరాజ్, వారి కుటుంబ సభ్యులు కాకి శివరామకృష్ణ ముదిరాజ్, కాకి సాయిషా ముదిరాజ్,కాకి గౌతమ్ ముదిరాజ్, కాకి సాత్విక్ ముదిరాజ్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు,

## ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి



**వలిగొండ, మే 19 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో అరూర్ గ్రామంలో ఐలపాక నర్సమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి వారి కుమారుడు ఐలపాక స్వామి ని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, దామెర అంజయ్య, బుర్ర శ్రీశైలం, వేముల అనిల్ కుమార్, భోగరం ధర్మయ్య, పోలేపాక నర్సింహా, బుర్ర శివ, పుట్టల కృష్ణ,నల్ల రాజు,చాడా నర్సింహ్మా,బోలుగుల రాజు, చాడా కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# గుండెపోటుతో ఎస్సీఆర్పీఎస్ నాయకుడు మృతి



**మహేశ్వరం మే 19 వార్త వేదిక సూర్య**

శంకర్ పల్లి మండలం, జన్వాడ గ్రామానికి చెందిన షెడ్యూల్డ్ క్యాస్ట్స్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ నాయకుడు అంతిగల్ల రాజు (41) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 7 గంటలకు చేతిలో నొప్పి వస్తుందని చెప్పగా వెంటనే శంకర్ పల్లి లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు అక్కడినుండి గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 9 గంటలకు తుది శ్వాస విడిచారు. మృతుడికి కూతురు, కుమారుడు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంతే గల రాజు మృతితో ఆయన కుటుంబం శాఖ సముద్రంలో మునిగిపోయింది. గ్రామంలో ఎవరికి సమస్య వచ్చినా తన సమస్యగా భావించి స్పందించే వారిని, అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమని గ్రామస్తులు తెలిపారు. అశ్రు నయనాల మధ్య మంగళవారం సాయంత్రం ఆయన స్వ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

# తాజ్పూర్‌లో బడిబాట

**- ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య**

**- సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్**



**భువనగిరి మే 19, (వార్త వేధిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులను కలిసి ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న సౌకర్యాలు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల గురించి వివరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబ్ యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మరపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కే హైమద్, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.









Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**